పెద్దమనుష్యులు గారు. మగవాళ్ళే పెద్దమనుష్యులు." అని కోపంపడ్డాట్ట. ఇంకా పిల్లలు నవ్వుతూవుంటే డైరక్టర్ను కోరుకొని ఆ కళాశాలనుంచి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాట్ట."

"ఆఁ ఆఁ. పెద్దమనిషి అయింది అంటే అర్థంకాక నేనా ఊరునుంచి వూరుబదలాయించుకున్నది ఆ బడిపంతులు?" అని అడిగింది బుచ్చిరామయ్యను బుచ్చిరామయ్యభార్య. అడుగుతూ తన గౌరీదేవిపూజ ప్రారంభించి చేసుకుంటూవుంది. 'పసుపు కుంకుం సమర్పయామి. గౌరీమహాలక్ష్మితల్లీ!' అని.

పూజాసమయాన్ని భార్య వాడిన తెనుగునకు పుబ్బిపోయి బుచ్చిరామయ్య హిందీపుస్తకం ఆవలపెట్టి మాతృభాషలో పద్యానికి ఉద్యుక్తుడయినాడు. ప్రథమయత్నంగా

"తెనుగుతల్లీ!"
తేరేచరణోం సమర్పయామి.
నాగులాబి అబ్ సమర్పయామిక్రొంబడ్
తెనుగుతల్లీ జేజే! జేజే!

అని ఉద్రిక్తుడైనాడు. బృందగానం 'తెనుగుతల్లీ! జేజేజేజే! జేజేజేజే! జేజే!

....

జాతీయత

"జాతీయత యనేది ఎక్కడుందీ
మనవాళ్ళల్లో? అంతటా చచ్చింది"

అలాటే 'అంతటా చావలేదు. ఇంకా కొందటి కొందటి హృదయాల్లోవుంది' అన్నాడు మిత్రుడు వెంకటరత్నం.

వెంకటరత్నం రచ్చపక్షి. వాడి కన్నీ హృత్కవనమే. కేసులు తనవి యయినవీ తనవి కానివీకూడా సివిల్, క్రిమినల్, రెవిన్యూ, అన్నిసైడ్లువీ తిలకించి పారేస్తూ వుంటాడు. 'వో గొడవ చెబుతాను వినూ' అన్నాడు. 'జాతీయతను పురిగొల్పేదవుతేనే కావాలి' అన్నాను నేను. 'అలాంటిది కాకపోతే చెప్పనే చెప్పను. నావాణీ పలకనే పలకదు' అన్నాడు. అని వోపెద్ద క్రిమినలు కేసు ఎత్తుకున్నాడు.

ఆ కేసు సంగతి ఏమిటంటే! చంద్రమండలంలోంచి కొత్తగా దిగివచ్చిన ఓ విజ్ఞాని భూమిమీద దున్నుకు బతికే ఓ రయితుమీద తెచ్చిన క్రిమినల్ సైడు యభియోగం. లాతి మనిషీ ఘట్టివాడే! రయితూ ఘట్టివాడే. అందులోనూ కోర్టు కెక్కింతరవాత చివరకంటా చూడని వెట్టిముండా వాళ్లెక్కడో కావి ఉండరు. లాతిమనిషికి చంద్రమాండలీకుల పెట్టుబడి. రయితుకి తనయొక్క జాతీయవాదుల పార్టీఫండు పెట్టుబడి. లాతిమనిషికి న్యూస్ పేపరు కర్రస్పాండెంట్సుయొక్క పెద్దక్షరాల ఎడ్వర్టైజుమెంటు. రైతుకు వీధిలో మాసెస్సుయొక్క జయ జయ ధ్వానాలు!

అసలు కేసేమిటంటే:-అది మఱచి పోకూడదు మనం—

వెంకయ్య యనే ఓరయితు ఈ పుణ్యావంతమైన ఆర్యావర్తమందు పుట్టిన మహావ్యక్తి. అతడో చోట ఓ సారవంతమైన సుక్షేత్ర ఖండికలో ఆనప్పాదు బీరపాదు చిక్కుడుపాదు ఇత్యాదుల పాదుల్ని పెట్టి, వాటికి పందిళ్ళేసి, పైకి లేవదీసి, దృష్టి తగలకుండా ఓమగాడి బొమ్మ దృష్టి బొమ్మ, పదిమందికీ కనబడేలాగు నిలబెట్టాడు. గడ్డి వెంటి చుట్టబెట్టినాడు. అయితే

యతడు చేసిందేమిటి ?—అందరూ సర్వసాధారణంగా తలపాగా పెట్టి యలాంటి బొమ్మల్ని యలంకరిస్తూవుంటే మన వెంకయ్యే ఏం చేశాడూ ? ఓ గుబ్బటోపీ ఎక్కడిదో ఏపెంటమీద పారేసిందో తీసికొచ్చి దాన్ని ఆ బొమ్మ బుఱ్ఱకు తగిలించాడు. పదిమందీ చూచీ వారు యతి విడ్డూరంగా. తెలిసినవాళ్లు కొందఱనుకునీ వారుకూడాను ' ఈ మాటు వెంకయ్యే తన దృష్టి బొమ్మను చంద్రలోకంలోంచి దింపే ' డని. 'వాడిపని యవుతుంది' యని. అనుకుంటేం ? దృష్టి బొమ్మ దృష్టి బొమ్మే, యది వొకరికి కోపకారణం కానన్నాళ్ళూను.

ఓ రోజున 'కిలోలీ' యనే చంద్రమండలపు వ్యక్తి ఆలా ఆ దారమ్మట వెళ్ళడం తటస్థించింది. వెళ్ళడమే కాకుండా ఆ బొమ్మను నఖశిఖ పర్యంతం పరీక్షించడం తటస్థించింది. వెంటనే కేకేయించాడు, వెంకయ్యే వచ్చాడు. ఆ జెంటిల్‌మాన్‌కు సలాము పెట్టాడు. చంద్రమండలపు టోపీ ఆలాంటి బొమ్మలకుంచకూడదన్నాడు కిలోలీ. వెంకయ్యే : ఏం ? అని అడిగాడు, మొదట్లో మిక్కిలి శాంతంగానే సత్యం తెలుసుకుందామనే సదుద్దేశ్యంతో.

కిలోలీ ఏం ? ఏమిటి ? అవి మేం పెట్టుకునేటోపీలు అవి అలాంటి వికృతపు బొమ్మలకు తగిలిస్తే మమ్మల్ని యవమానపరిచినట్టు యన్నాడు. వెంకయ్యే ఆ లాతిమనిషికి నచ్చచెప్పాలని చూశాడు యిలాచెప్పి. ' అలా కాదండీ ! సార్ ! సార్ ! ఎవరితో మాట్లాడినా ఇంగ్లీషే దొర్లిపోతుంది, ఆంధ్రదేశంలో రయితునుండి రాజులదాకా. అది చూశారూ ! ఆలా కాదండీ ! ఇది నేను చంద్రమండలంలో వారినిగాని మరొకళ్ళను

గాని వికృతంగా చూపించే భావంతో నిలపలేదండి. నాపాదులు బాగా కాయాలనే స్వలాభపేక్షతో చేసికొన్నపనండి. అలా చిర కాలంనుంచీ యనుశ్రుతంగా వస్తూవున్న ప్రదర్శనమేనండి ఇది యన్నాడు వెంకయ్య. 'ఛెట్ ! తీసేస్తావా తీసెయ్యవా ?' అని యడిగాడు కిలోలీ. రెండో కాలంలో యడగ్గా నేను తీసి వెయ్యను. చెప్పుకో నీ దిక్కున్న చోట. ఇప్పుడు మావాళ్ళూ మా భూలోకవాసులూ, వాళ్లెంత చీకటి వాసులైనా పెట్టుకుంటూనే వున్నారు ఆలాంటి గుబ్బటోపీలు. మావాళ్లు పూర్వం తలపాగాలు పెట్టుకునే వాళ్లు. కాబట్టి యప్పట్లో మాదృష్టి బొమ్మలకు తల పాగాలు చుట్టేవాళ్లం. ఇప్పుడు వాళ్ళు ఇవి పెట్టుకుంటూవున్నారు. కాబట్టి ఈ టోపీలు పెడుతున్నాం. నిన్నూ నీవాళ్ళనూ ఆక్షేపించి నట్టుండడమేమిటి? పో ! నీదిక్కున్న చోట చెప్పుకో యన్నాడు వెంకయ్య తీవ్రంగా. కిలోలీ మూడవకాలంలో చిందులు తొక్కుతూ—ఒక్కతుపాకి పేల్చడం తరువాయిగా యంగారక పాదరక్షల్తో నేలదిమ్మిస చేసుకుంటూ 'ధామ్ ధూమ్' అని ఆ దృష్టి బొమ్మమీది ఆ గుబ్బటోపీ ఊడపెటికి మట్టిలో ఊర ద్రొక్కి తనదారే వెళ్ళిపోయినాడు. వెంకయ్య ఎఱ్ఱగా చింత నిప్పులా చూచాడు కిలోలీ వెనకాలే. వీడి పని ఇలావుందా వాడి పొగరణచాలి యనుకున్నాడు. అని యనుకొని మట్టి యయి పోయిన ఆ టోపీ పైకెత్తి దులిపి దృష్టి బొమ్మయొక్క వొంటి చిలక్కొయ్యకు తగిలించినాడు. తాను ఆ ప్రక్కనే పెద్ద ముల కాల కర్రతో నిలబడ్డాడు.

కిలోలీ ఆ దారినే తిరిగి రావడం తటస్థించింది. రెండో వేషం చూచాడు. మఱింత ఉగ్రుడై పోయాడు. కాని

ఆ పర్యాయం ఏమి అనలేదు. తన కోపం తనలోనే అణచుకున్నాడా అన్నట్టు అణచుకొని చల్లగా జారాడు. చంద్రలోకానికి తన పక్కబలం చూపించేడు.

చంద్రలోకానికి వెళ్ళిపోయినాడన్న మాటేగాని కిలోలీకి ఆ రేత్రి ఏమి నిద్దరపట్టలేదు. తెల్లాటి పొద్దున్నే లేచి ఏడు గంటలకే తిన్నగా భూమ్మీదికి దిగి—నేరం భూమ్మీద జరిగింది. కాబట్టి భూమ్మీదేగా జ్యూరిస్ డిక్షను—నేరుగా ఓ బారిష్టరుగారి ఛాంబర్సుకు వెళ్ళాడు. జరిగిన సంగతి ఆయన్తో సవిస్తారంగా చెప్పాడు.

బారిష్టరుగారు సూర్యలోకపు మనిషి. ఆయనకు తెలుగు బాగా రాదు. కాని లా బాగా తెలుసు. ఆయనకు హిందువుల యొక్క ఆచారవ్యవహారాలు బాగా తెలియకపోయినా లోక సామాన్యంగా అనుకునే సభ్యాసభ్యతల గుర్తింపు కద్దు. అందు చేత కిలోలీ తన పితూరీ అంతా పూర్తిగా విప్పి చెప్పడంతోనే బారిష్టరుగారు అడిగేరు. 'ఆ బొమ్మ నోస్కెచ్చివేసి చూపించ' మని. కిలోలీవేసి, చూపించేడు హార్డు పెన్సిలుతో ఫ్రీహాండు డ్రాయింగు గీసినట్టుగా.

బారిష్టరుగారు బహూసునిశితంగా ముక్కద్దాల సమేతమైన చూపు చూచి, భాయిజీ! మీరువేసిన బొమ్మయొక్క చిలక కొయ్య ప్రదేశం, మగవాని అస్థిపంజరంలో వుండే అశ్లీల ప్రదేశంగా కనిపిస్తుంది. దాన్ని వ్యక్తీకరించినాడూ అంటే అతడు శిక్షాస్మృత్యను సారంగా దండనార్హుడు. ఆ ప్రకారంగా చార్జీ వ్రాయమంటే వ్రాస్తాను' అన్నాడు. మఱిన్నీ బారిష్టరు గారు ఏమన్నారూ అంటే 'గుబ్బటోపీలు ఒక్క చంద్రమండలం

వారి హక్కే కాదు. భూప్రదేశమాత్రుల హక్కు కూడాను. ఎంచేతా అంటే చంద్రమండలంలో నల్లరేగడి ఎక్కడిది ? భూమిదే ? మఱిన్నీ అవి మనుష్యుల హక్కే కాక, దృష్టి బొమ్మల హక్కుకూడాను. ఎంచేత అంటే ప్రతీగుబ్బాకారానికి వసారా దిగుతుంది. వసారా దిగింది అంటే ఆ పదార్థానికి అల్ ఎంబ్రేసింగు—సర్వంకౌగిలీ -- స్వభావము కలదు అన్నమాట. మహదమహత్తిర్యక్ జడా జడ స్వరూపాలన్నింటికీ భోక్తవ్యమన్నమాట అన్నాడు.

కిలోలీ మంచి క్లయింటేమో బారిష్టరుగారితో వాగ్వాదం పెట్టుకోక ‘ చార్జీ ఎలా నిలుస్తుందో ఆ అంశములు గుదిగుచ్చి కంప్లెంటు వ్రాయమన్నాడు. కంప్లయింటు వ్రాసి బారిష్టరుగారు ఆనాడే 11 గంటలకు క్రిమినల్ కోర్టులో దాఖలు చేయించినారు.

ఇక ఆ దెబ్బతో వెంకయ్యపని అయిపోయిందంటే అయిపోయిందన్నారు పదిమందీని. పత్రికాధిపతులు ప్రధాన వ్యాసాల్లోకూడా అలాంటి దృష్టి బొమ్మల ప్రదర్శనం, కుంకుటి వేళ్ళల్లోకంటా తెంచాయ్యలని వ్రాశారు. కరెస్పాండెంట్లు ఇచ్చిన సంజాయిషీ పుచ్చుకుని, ఎక్కడ చెప్పుకున్నా వెంకయ్య కిలోలీగార్లగొడవే, ఆబాలగోపాలమున్నూ—

కేసు మరి ఇరవై రోజులికి విచారణకు వచ్చింది. విచారణకు వచ్చిన సందర్భంలో మఱి వాయిదా వేయకుండా, పైనుంచి దిగొచ్చిన వారి కేసని కామోసు మేజస్ట్రేటుగారు తీసి, అంతా చదివి సాక్ష్యం పుచ్చుకున్నారు. వెంకయ్య వకీల్ను పెట్టుకో నన్నాడు. తాను సొంతంగానే చంద్రలోక వాస్తవ్యుణ్ణి అడ్డసవాళ్ళేయదొడగేడు.

"ఏమండీ! సార్! సార్! మీరు మా హిందువుల దేవాలయాల్ని ఎప్పుడైనా చూచినారా?"

"చూడకేం. లోపలకు వెళ్ళలేదు. కాని పైనుంచి చూచాను."

"ఎక్కడి దేవాలయం చూచారు?"

"ఊరి బయటిది"

"కొట్టాలమ్మదా?"

"దాని మీది బొమ్మల్ని పరీక్షించారా?"

"చూచాను"

"అవి అశ్లీలాలు కావుటండీ"

"అశ్లీలాలే. అవుతేం. అవి మతవిషయకం. మేం కలగ జేసికోకూడదు మీ మతంతో."

"పోనీ చూడండీ! సుఖరోగాల్ని గురించిన పుస్తకాలెప్పుడన్నా చూచారా?"

"చూడకేం"

"అందులో బొమ్మలు చూచారా?"

"చూచినాను."

"అవి అశ్లీలాలు గావా?"

"అశ్లీలాలే. కాని అవి శాస్త్రగ్రంథాలు"

"పోనీ! సార్! సార్! చిన్న పిల్లలు దిగంబరులై తిరుగుతూ వుండడం ఎప్పుడైనా చూచినారా?"

"చూడకేం. చాలాసార్లు చూచినాను"

"ఆవాళ్ళ ప్రదర్శనం అశ్లీల ప్రదర్శనం కాదా?"

"శిశువులు దివ్యులు. శిశువులు గంధర్వులు!"

" మిస్టర్ ! పత్రికల్లో స్వేచ్ఛగా అచ్చు పడుతూవున్న నగ్నచిత్రాల్లోని యౌవనార్భాటాన్ని గుర్తించారా ?"

" గుర్తించకేం. అలా అందరంవుంటే ఆరోగ్యం అని నమ్మిన వాళ్ళల్లో నేనొకణ్ణి. "

" అయితే నాదృష్టి బొమ్మయొక్క అశ్లీల ప్రదర్శనం పై వేటిల్లోకీ రాలేదా ? మీరు బాగా వూహించి చెప్పండి గుండె మీద చెయివేసికొని. "

సాక్షి కిలోలీకి జవాబు పెగల్లే.

మేజస్ట్రేటుగారు ' చెప్పాలి ! వేగం చెప్పాలి ' అన్నారు.

అంత చంద్రలోకపు మనిషీన్నీ ఏమీ మాట్లాడలేక పోయినాడు ఆ అడ్డు సవాలుకు.—

ఫిర్యాదీ కప్పుడు బారిష్టరుగారు సాయపడి కోర్టువారితో ఇలా మనవిచేసినారు. ' మా తగువల్లా గుబ్బ టోపీ ఆ అశ్లీల ప్రదేశంలోని చిలక్కొయ్యకు తగల్చడమే ' అన్నాడు.

వెంకయ్య వెంటనే కోర్టువారి దిక్కు మొగంబై అన్నాడు. ' మహాప్రభో ! కుర్చీలమీదను, కుర్చీలక్రిందను, వరండాలోనూ, బల్లలమీదనూ, చూరులోనూ, పారేశీకన్న చిలకకొయ్యకు తగిలిస్తే మంచిదని తగిలించాను ' అన్నాడు.

చూడవచ్చిన వాళ్ళంతా గొల్లున నవ్వారు.—

మేజస్ట్రేటుగారు మాత్రం ఫిర్యాది సాక్ష్యం ఎలావున్న ముద్దాయిని చార్జీ చేశానన్నారు. తిరిగి ఫర్దర్ క్రాసుచేసుకొంటావా అని ముద్దాయిని అడిగి చేసుకొంటానంటే మరో రోజుకు వాయిదా వేసినారు వాయిదా నాటికి మళ్ళీ అంతా హాజరయినారు.

తిరిగి క్రాసు చేయడంలో మూడు ముక్కలే అడిగాడు వెంకయ్య. ఒకటి—' మీరు చూచినప్పుడు టోపీ జూచినారా. అశ్లీల ప్రదేశం జూచినారా ' అని. జవాబు 'టోపీయే' రెండు టోపీ నెత్తిమీదనుంచి తీసి వాళ్లో పెట్టుకోవడం రివాజు వుందా లేదా ?' జవాబు ' ఉంది ' మూడు. ' ఒడి అన్నది అశ్లీల ప్రదేశమా ? శ్లీలప్రదేశమా ? జవాబు ' ఒడి ! ఒడి !' అని పిర్యాది తన ఒడి ఎగాదిగా జూచుకుంటూ ' శ్లీలప్రదేశమే ! శ్లీలప్రదేశమే ' అన్నాడు.

' ఇక అశ్లీలానికి తావెక్కడ ?' అని మేజిస్ట్రేటుగారు మరి ఉత్తర సాక్ష్యంతో నిమిత్తం లేకుండా చంద్రమండల వాస్తవ్యుని ఆవ్యాజం కొట్టివేసినారు.

ఆనాటినుంచీ వెంకయ్య గొప్ప జాతీయ నాయకుడై పోయాడు ! కావ్యాల్లో దక్షిణ నాయకుడిలాగు మోగేశాడు.

....

మ టి లే దు

తల్లో పసుపు పచ్చని పెద్ద చేమంతి తురుముకొని, ఒక డొంకెన కర్రతో వఱదలో ఎండు పుల్ల, ఆ చితుకు ఆ చితుకు, ఆ యెమ్మెలాడి పట్టుకొంటూ వొడ్డుకు విసరుతూ వుంది. ఆమె పెట్టుకున్న చేమంతి పూలు గట్టునున్న కోడెకాండ్రు చూస్తూ వున్నారు.

కొంత సేపటికి పాపారావు అనే యువకుడు కనిపించాడు. వాడడిగాడు ఈ పడుచుని : " నీవు ఇక్కడకు ఎలా వచ్చావు!" అని. " గట్టంతా నాదే కదంట్రా యింక ! ఇల్లా గడ్డిమేటా ?